క్లుప్తంగా

విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

సారవకోట: మండలంలోని బద్రి గ్రామంలో ఎంపీటీసీ డాక్టర్ మెండ బాలచంద్రరావునాయుడు విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. ఆయనపై ఉన్న అభిమానంతో స్థానిక యువకులు అనకాపల్లిలో విగ్రహాన్ని తయారు చేయించారు. కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలో విగ్రహాన్ని ఆవిష్కరించారు. బాలచంద్రరావునాయుడు మృతి గ్రామానికి తీరని లోటని యువకులు అన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష



ప్రవేశ పరీక్షను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ అర్చన

పాతపట్నం: పాతపట్నం డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో మిగులు సీట్లకు శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ వి.అర్చన తెలిపారు. 6 నుంచి 9వ తరగతి వరకు మిగులు సీట్లకు ప్రవేశ పరీక్షలు నిర్వహించామన్నారు. 6వ తరగతిలో ఎస్సీ కేటగిరికి 23 సీట్లు, 7వ తరగతిలో ఎస్సీ ఒకటి, 8వ తరగతిలో ఎస్సీ, బీసీలకు ఒక్కొక్కటి చొప్పున, 9వ తరగతిలో ఎస్సీకి నాలుగు, బీసీకి రెండు సీట్లు చొప్పున భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ వి.సంధ్యరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పక్కాగా పింఛన్ల పంపిణీ

పాతపట్నం: మండలంలోని 18 గ్రామ సచివాలయ పరిధిలోని ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సచివాలయ ఉద్యోగులతో పింఛన్ల పంపిణీపై శనివారం సమావేశం నిర్వహించారు. మండలంలో 10,031 మంది పింఛన్‌దారులకు రూ.6,75,11,500 కోట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. జూలై ఒకటో తేదీన నుంచి ఐదుగురు పరిశీలకులు, 171 మంది సచివాలయ ఉద్యోగులు పింఛన్ పంపిణీకి ఉపయోగిస్తున్నామన్నారు. 1వ తేదీనే పూర్తి స్థాయిలో పంపిణీ చేస్తామని, అవసరమైతే రెండో తేదీన కూడా ఉంటుందన్నారు. ఏవో రాజేశ్వరావు, మిశ్రో, అరుణ్, సెక్రటరీలు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి



వీఆర్వోను సన్మానిస్తున్న తహసీల్దార్ ప్రసాదరావు

పాతపట్నం: మండలంలోని రొంపివలస వీఆర్వోగా పనిచేసిన జి.హిమగిరి నాయుడు పదవీ విరమణ పొందారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వై.ఎస్.వి.వి.ప్రసాదరావు మాట్లాడుతూ సేవలే సమాజానికి గుర్తింపుగా నిలుస్తాయన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, మండల సర్వేయర్ రామగణపతి, నారాయణరావు, ఏఎస్ఓ బాలరాజు, సీనియర్ అసిస్టెంట్ జగన్మోహన్‌రావు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి పనులు పూర్తిచేయాలని వినతి



సీఎంతో కూన రవికుమార్

ఆమదాలవలస: ఆమదాలవలస–శ్రీకాకుళం ప్రధాన రహదారి పనులను పూర్తిచేయాలి ముఖ్యమంత్రి చంద్రబాబును ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. అమరావతిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో చంద్రబాబును శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రహదారి పనులు మధ్యలోనే నిలిచిపోయాయని వివరించారు. ఇటీవల జరిగిన ఎన్నికల ప్రచారంలో రహదారి నిర్మాణ పనులు పూర్తిచేస్తామని ప్రజలకు హామీ ఇచ్చానన్నారు. రహదారి పనులను పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మార్కెట్ వేలంపాట ఖరారు



వేలంపాట నిర్వహిస్తున్న ఈఓపీఆర్డీ కృష్ణారావు

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ గ్రామ పంచాయతీ మార్కెట్ రోజువారి ఆశీల వసూలు పాటను కూనిబిల్లి అన్నపూర్ణకు రూ.2,07,200లకు దక్కించుకున్నట్లు ఈఓపీఆర్డీ కె.కృష్ణారావు తెలిపారు. కర్లెమ్మ గ్రామ సచివాలయంలో సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌నాయుడు అధ్యక్షతన శనివారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలం పాటకు 95 మంది పాటదారులు హాజరయ్యారు. పంచాయతీ కార్యదర్శి రామనారాయణ, కర్లెమ్మ ఆర్ఆర్ కాలనీ సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీ గౌరీ, ఉప సర్పంచ్ పాల్గొన్నారు.

● వితరణ



పాతపట్నం మండలంలోని పెద్దలోగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులను దాతలు వితరణ ఇచ్చారని హెచ్ఎం బి.రాజగోపాలరావు అన్నారు. విశ్రాంత వీఆర్వో రాజేశ్వరరావు తన మనవడు యజ్ఞ పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు బ్యాగులను శనివారం అందజేశారు. పాఠశాలలో చదువుతున్న 6 నుంచి 10వ తరగతి విద్యార్థులందరికీ బ్యాగులు అందించినట్లు హెచ్ఎం తెలిపారు. ఉపాధ్యాయులు బాలరాజు, మన్మధరావు, సుజాత, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

– పాతపట్నం

● ప్రమాదకర పిలుపు



బూర్జ మండలంలోని పెద్దపేట పంచాయతీ పరిధిలో గల శ్రీకాకుళం–పాలకొండ పక్కా రహదారిలోని ఈ మలుపు చాలా ప్రమాదకరం. నిత్యం ఆర్టీసీ బస్సులు, లారీలు, తదితర వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఈ మలుపు దగ్గర ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయానలి ప్రయాణికులు కోరుతున్నారు.

– బూర్జ

● ఆర్థికసాయం



మెళియాపుట్టి మండలంలోని ఎర్రమాను గూడ గిరిజన గ్రామానికి చెందిన సవర ఖగేశ్వరరావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం కోమాలో ఉన్నారు. ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. ఆరోగ్యశ్రీ వర్తించలేదు. నిరుపేద కుటుంబం కావడంతో దాతల సహాయం కోసం ఎదురు చూస్తుంది. ఎర్రమానుగూడ గిరిజన గ్రామానికి చెందిన కొంత మంది గిరిజన యువకులు వారి దాతృత్వాన్ని చాటుకున్నారు. వారి వంతుగా రూ.27,000 ఆర్థిక సహాయాన్ని శనివారం విశాఖపట్నం వెళ్లి అందించారు.

– మెళియాపుట్టి

రాజీయే రాజమార్గం



పొందూరు: మాట్లాడుతున్న జడ్జి జ్యోత్స్న

● సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్ లక్ష్యం

పొందూరు: కక్షిదారులకు కాలయాపన జరగకుండా ఇరువర్గాలకు సత్వర న్యాయం అందించేందుకే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పొందూరు జూనియర్ సివిల్ జడ్జి బీ.జ్యోత్స్న అన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టులో జడ్జి ఆధ్వర్యంలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. క్రిమినల్, సివిల్‌కు సంబంధించి 34 కేసులను పరిష్కరించారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

సమయం వృథా చేసుకోవద్దు

కొత్తూరు: కేసుల విషయంలో సమయాన్ని వృథా చేసుకోవద్దని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జూనియర్ జడ్జి.కె.రాణి కక్షదారులకు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను స్థానిక కోర్టులో జడ్జి నిర్వహించారు. 39 కేసులు రాజీ చేయడం జరిగింది. ఇందులో 23 కేసులకు సంబంధించి రూ.46 వేల అపరాధ రుసుం విధించారు. పలు కేసుల్లో ఇరువర్గాలకు రాజీ కుదిర్చిన సందర్భంగా రూ.9 లక్షలు ఇప్పించడం జరిగింది. ప్రభుత్వ ప్లీడర్ రాడ రాజు, న్యాయవాదులు పాల్గొన్నారు.



కొత్తూరు: కేసులు పరిష్కరిస్తున్న జడ్జి రాణి

103 కేసులు పరిష్కారం..

నరసన్నపేట: స్థానిక సివిల్ జడ్జి కోర్టులో జడ్జి సి.హరిప్రియ అధ్యక్షతన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 103 కేసులు పరిష్కారయ్యాయి. సీసీ ఐపీసీ కేసులు 27, సీసీ ఎన్ఐ యాక్ట్ కేసులు 4, మెయింటెనెన్స్ కేసులు 3, సివిల్ కేసులు ఐదుతో పాటు మొత్తం 103 కేసులు పరిష్కరించారు. నరసన్నపేట సీఐ, ఎస్ఐలు బి.ప్రసాదరావు, అశోక్‌బాబు, సెబ్ సీఐ, ఎస్ఐలు సంతోష్‌కుమార్, కావ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

36 కేసులు పరిష్కారం..

పాతపట్నం: పాతపట్నంలోని కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 36 కేసులను పరిష్కరించినట్లు ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్.తేజ చక్రవర్తి తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, రాజీపడదగిన క్రిమినల్ కేసులు, ఎంవీ కేసు, పార్టీ షూట్ కేసు, జూదం కేసులు మొత్తం 36 కేసులు పరిష్కరించారు. కక్షిదారుల నుంచి అపరాధ రుసుంగా రూ.2.30 లక్షలు వసూలు అయిందన్నారు. న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

87 కేసులు పరిష్కారం..

ఆమదాలవలస: ఆమదాలవలస సివిల్ జడ్జి కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, మోటారు వెహికల్, మనోవర్తి , పీఎల్‌సీ తదితర 87 కేసులు పరిష్కరించారు. రూ.33,260 అపరాధ రుసుం వసూలు చేశారు. లోక్ అదాలత్ మెంబర్లు కింతలి త్రినాథరావు, ధనుంజయరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.



నరసన్నపేట: లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి హరిప్రియ



పాతపట్నం: కేసులు పరిష్కరిస్తున్న జడ్జి తేజ చక్రవర్తి



ఆమదాలవలస: కేసులు పరిష్కరిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మణి

నేను బడికి పోతా..

జలుమూరు: ప్రభుత్వ బడులు బలోపేతానికి అందరూ కృషి చేయాలని ఎంఈఓలు బమ్మిడి మాధవరావు, ఎం.వి.ఆర్.ఎస్ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రం జలుమూరు, సురవరం ప్రాథమిక పాఠశాలల్లో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా శనివారం ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వ బడుల్లో చదవడం వల్ల నాణ్యమైన విద్యతోపాటు ఉచిత పుస్తకాలు, దుస్తులు, భోజనం అందుతాయన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సురవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులను చేర్పించి ప్రభుత్వ విద్యా విధానం మరింత బలోపేతం చేద్దామని ఎంఈఓలు సి.హెచ్.మణికుమార్, కె.చంద్రమౌళి అన్నారు. మండలంలోని తాయిమాంబాపురం ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎంలతో శనివారం జరిగిన సమావేశంలో వీరు మాట్లాడారు.

పీఎం పోషణ, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం కిట్లుపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చదివించటం వల్ల కలిగే ప్రయోజనాల కోసం తెలియజేయాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యా బోధన చేయాలన్నారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ కె.ఉపేంద్ర, సీఆర్పీలు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను బడిలో చేర్పించండి

నరసన్నపేట: బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని, 6 నుంచి 14 ఏళ్లలోపు ఉన్న పిల్లలు అందరూ స్కూళ్లలోనే ఉండాలని ఎంఈఓ–2 పి.దాలినాయుడు అన్నారు. కోమర్తి స్కూల్లో విద్యా ప్రవేశం–90 రోజుల కార్యక్రమం అమలు తీరును శనివారం పరిశీలించారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ, ఇంటింటా సర్వేలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. నిపుణులైన ఉపాధ్యాయులు ఉన్నారని, నాణ్యమైన విద్యను అందిస్తారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న క్లస్టర్ స్థాయి సమావేశంలో పాల్గొని అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ అల్లు రమణమ్మ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ దాలినాయుడు, విద్యార్థులు

ఒడియా మీడియం కొనసాగించాలి

మెళియాపుట్టి: మండలంలోని చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒడియా మీడియం తొలగించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. ఎంఈఓ దేవేంద్రరావు, హెచ్ఎం గణపతిరావును కలిసి ఒడియా మీడియం కొనసాగించాలని కోరారు. పూలసారి, గంగరాజపురం, పద్మ, మెళియాపుట్టి, సుర్జిని తదితర గ్రామాలకు చెందిన 6 నుంచి 10వ తరగతి చదువుతున్న ఒడియా మీడియం విద్యార్థులు సుమారుగా 100 మంది ఉన్నారన్నారు. అర్ధంతరంగా ఒడియా మీడియం నిలిపివేస్తే తమ పిల్లల భవిష్యత్ ఏమిటని ప్రశ్నించారు. ఒడియా మాధ్యమంలోనే బోధన, పరీక్షలు నిర్వహించాలని, దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. సమస్యను ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లినట్టు విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. వారం రోజుల్లో సమస్యకు పరిష్కారం చేయకపోతే పాఠశాల ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. దీనిపై ఎంఈఓ, హెచ్ఎంలను ప్రశ్నించగా.. విషయం తమ పరిధిలో లేదని, ఉన్నతాధికారులే పరిష్కరించాలని, వారి దృష్టిలో విషయం ఉందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సంతోష్ బిస్వాల్, ఆకాష్ బిస్వాల్, రమేష్ ఆపటో, ప్రఫుల్లా ప్రధాన్, ఎం.కె.పట్నాయక్ ఉన్నారు.



పాఠశాల ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

డయేరియా నివారణకు చర్యలు

సరుబుజ్జిలి: ఐదేళ్ల లోపు వయస్సు గల చిన్నారులు డయేరియా(నీళ్ల విరోచనాలు) బారిన పడకుండా జూలై 1 నుంచి ఆగష్టు చివరి వరకు ప్రత్యేక డ్రైవ్ ద్వారా అవగాహన సదస్సులు నిర్వహించనున్నామని వైద్యాధికారులు ఎం.సంతోష్‌కుమార్, సాహితి ప్రియదర్శిని తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షేత్ర స్థాయి వైద్య సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో భాగంగా వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ఓఆర్ఎస్ స్వయంగా తయారీ, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, తాగునీటి వనరులు తనిఖీలు చేయాలన్నారు. సీహెచ్ఓ మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి సూచలిస్తున్న వైద్యాధికారులు

పాఠశాల అభివృద్ధికి సహకరిస్తా..

సరుబుజ్జిలి: చినకాగితాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని టీడీపీ నాయకుడు గురువు తిరుమలరావు తెలిపారు. శనివారం పాఠశాలను సందర్శించారు. సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. తెలికిపెంట పంచాయతీ చినకాగితాపల్లి మాజీ సర్పంచ్ నందివాడ గోవిందరావు, వెలమల రమేష్ సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాత్కాలిక మరుగుదొడ్లను తన సొంత నిధులతో నిర్మిస్తానన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు రక్షణ కల్పిస్తాం

నరసన్నపేట: దివ్యాంగ విద్యార్థులకు రక్షణ కల్పిస్తామని, వారికి ఉన్నతమైన విద్యను అందిస్తామని నరసన్నపేట ఎంఈఓ శాంతారావు అన్నారు. మండలంలోని యారబాడు, లింగాలపాడు, వీఎన్పురం గ్రామాల్లో పర్యటించి దివ్యాంగ విద్యార్థుల యోగక్షేమాలను, వారికి ఇంటి వద్ద అందుతున్న విద్యా కార్యక్రమాలను పరిశీలించారు. భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగ విద్యార్థులకు వివిధ కార్యక్రమాలు అందిస్తున్నట్లు తెలిపారు. మంచానికే పరిమితమైన దివ్యాంగ విద్యార్థులు 10 మందిని మండలంలో గుర్తించడం జరిగిందన్నారు. వీరికి ప్రతీ శనివారం ఇంటి వద్దే విద్యా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐఈడీ మండల కో ఆర్డినేటర్లు శ్రీనివాసరావు, కృష్ణవేణి పాల్గొన్నారు.



లింగాలపాడులో దివ్యాంగ విద్యార్థి యోగక్షేమాలను తెలుసుకుంటున్న ఎంఈఓ

ప్రకృతి వ్యవసాయంతో మేలు

హిరమండలం: ప్రకృతి వ్యవసాయంతో అనేక లాభాలు ఉన్నాయని నిపుణులు సూచించారు. మండలంలోని బొండిగూడ గ్రామంలో ఆదివాసి మహిళ యువజన చైతన్య సంఘం ఆధ్వర్యంలో.. హైదరాబాద్ యాక్షి స్వచ్ఛంద సేవా సంస్థ నేతృత్వంలో శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంతో సమయం, వ్యయం ఆదా చేయవచ్చన్నారు. రైతులకు సాగు సులభతరం అవుతుందన్నారు. ఈ సందర్భంగా మహిళా చట్టాల గురించి వివరించారు. ఇండియన్ పీనల్ కోడ్‌లో చట్టాలను మరింత కఠినతరం చేసినట్టు తెలిపారు. వైస్ ఎంపీపీ సవర వైకుంఠరావు, సంఘ ప్రతినిధులు సవర సుజాత, కురంగి ప్రభావతి, అడ్డాకుల మనీష, నిమ్మక అఖిల, సవర సౌందర్య తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

నరసన్నపేట: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి.. వాటిని సంరక్షించండి అని సత్యసాయి సేవా సమితి నరసన్నపేట జోన్ శాఖ ప్రతినిధులు బోయిన నర్సింహమూర్తి, రమణమూర్తి అన్నారు. మండలంలోని ముద్దాడపేటలో శనివారం వృక్ష ప్రతిష్ఠాపనా మహోత్సవం నిర్వహించారు. సత్యసాయికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. మొక్కలు పర్యావరణాన్ని కాపాడుతాయన్నారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ముద్దాడపేట సత్యసాయి భజన మండలి ప్రతినిధి బగ్గు శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

నరసన్నపేట: ఖరీఫ్ సీజన్ కావడంతో సాగునీటి కాలువల్లో జంగిల్ తొలగించడానికి ఉపాధి పనుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు అన్నారు. మండలంలోని తామరాపల్లిలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను శనివారం పరిశీలించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతగా ఉండి పనులు చేయించాలన్నారు. ఉపాధి నిధులు ఉద్యానవన పంటలకు అనుసంధానం చేయడం జరుగుతుందని, ఆసక్తి గల రైతులు వినియోగించుకోవాలన్నారు. అదనపు పీడీ జయరాం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

హిరమండలం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను అందించాలని స్థానిక జెడ్పీటీసీ పాగిరి బుచ్చిబాబు సూచించారు. శనివారం సుబలాయి ఆర్ అండ్ఆర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పూర్వ ప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

డీఎస్ మృతికి సంతాపం

ఆమదాలవలస: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ పీసీసీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ మృతికి ఏపీ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. 2004లో ఏపీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా ప్రాతినిధ్య వహించిన డీఎస్ సభ్యులందరితో ఎంతో హుందాగా వ్యవహరించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. అటువంటి వ్యక్తి మృతి తెలుగు రాష్ట్రాల్లోని కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు.

శివలింగానికి జలాభిషేకం

హిరమండలం: వరుణుడి కరుణ కోసం హిరమండలం వాసులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం చిన్న కోరాడవీధిలో ఉమారుద్ర కోటీశ్వరాలయంలో శివలింగానికి జలాభిషేకం చేశారు. పవిత్ర వంశధార జలాలను తీసుకొచ్చి అభిషేకం చేశారు. జలాలతో స్వామివారి గర్భగుడి నిండిపోయింది. పండితులు జోష్యుల గోవిందశర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాలకు మేజర్ పంచాయతీ నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



ఉమారుద్ర కోటేశ్వరస్వామికి జలాభిషేకం

తల్లిదండ్రులకు పాదపూజ

కొత్తూరు: మండలంలోని సిరుసువాడ గ్రామంలో తల్లిదండ్రులకు పిల్లలు పాదపూజ చేశారు. స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులపై పిల్లలకు మరింత అనురాగం, ప్రేమ పెరగాలన్న భావంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు లోతుగెడ్డ భగవాన్ నాయుడు తెలిపారు. సిరువాసడ మాజీ సర్పంచ్ అర్జున పాత్రో, సత్యసాయి సేవా సమితి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు